ఎడిసన్ జయంతి వేడుకలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 11(నమస్తే తెలంగాణ): విద్యుత్ బల్బ్‌ను కనిపెట్టిన మేధావి థామస్ అల్వా ఎడిసన్ జయంతి సందర్భంగా ఎలక్ట్రిషియన్ డేను మంగళవారం బడంగ్‌పేటలోని ఎమ్మెన్నార్ గార్డెన్స్‌లో తెలంగాణ ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ ఘనంగా నిర్వహించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క యాదగిరి మాట్లాడుతూ.. సాఫ్ట్‌వేర్ రంగంలో, ఇండస్ట్రియల్‌లో, కమర్షియల్‌లో, గృహసముదాయాల్లో పని చేసే ఎలక్ట్రిషియన్లందరూ వైర్‌మెన్ ఫార్మాట్‌ను లేక సూపర్‌వైజర్ ఫార్మాట్‌ను తీసుకోవాలన్నారు. తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు మెంబర్ నేమాల బెనర్జీ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్క ఎలక్ట్రిషియన్ నైపుణ్యంతోపాటు ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు ద్వారా వైర్‌మెన్‌కానీ, సూపర్‌వైజర్ కానీ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా అసోసియేషన్ 4వ వార్షికోత్సవ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామల శ్రీకాంత్‌రెడ్డి, జనరల్‌సెక్రటరీ శ్రీనివాస్ రావు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కొండబాల్‌రెడ్డి, ఉదయభాస్కర్, రవీంద్రచారి, ముధుసూదన్‌చారి, శ్రీధర్‌చారి, శ్రీనివాస్‌నేత, లక్ష్మణ్, సాయిలు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

వృథాగా మంచినీరు..

చంపాపేటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు రోడ్డులో మంచి నీళ్లు వృథాగా పోతున్నాయి. మంచి నీటి పైప్‌లైన్ మ్యాన్‌హోల్స్ జంక్షన్ల మరమ్మతులు చేపట్టడంతో వాటర్ పైప్‌లైన్ పగిలి తాగునీళ్లు రోడ్డుపై వృథాగా పారుతున్నాయి.

– చంపాపేట, ఫిబ్రవరి 11

పిచ్చి మొక్కలు తొలగించడానికి 7 కోట్లా..!

బడ్జెట్ లేకుండా రూ.200 కోట్లకు తీర్మానాలు ఎలా చేస్తారు..

బడంగ్‌పేటలో అసలు బడ్జెట్ ఎంత ఉంది .. వచ్చే ఆదాయం ఎంత

అధికారుల తీరుపై ఆగ్రహం

సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట మున్సిపల్ అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, ఫిబ్రవరి11 : పిచ్చి మొక్కలు తొలగించడానికి రూ.7కోట్లు ఖర్చు చేయడం పట్ల మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ సరస్వతి, డీఈలు యాదయ్య, జ్యోతి, ఆర్వో వేణుగోపాల్, ఏఈ వినిల్ గౌడ్, అకౌంటెంట్, ఎలక్ట్రిసిటీ, ఆర్‌అండ్‌బీ, ఫారెస్ట్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు జరిగిన వర్క్ లిస్ట్‌ను తెప్పించుకొని పరిశీలించారు. ఇప్పటి వరకు అయిన పనులు, ప్రస్తుతం జరుగుతున్న పనులు, పెండింగ్‌లో ఉన్న పనులు, ఇంకా టెండర్‌కాని పనుల వివరాలను డీఈలను అడిగి తెలుసుకున్నారు. అసలు బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌కు సంవత్సరానికి ఎంత ఆదాయం వస్తుందని ఆమె కమిషనర్ సరస్వతిని అడిగారు. అందుకు ఆమె రూ.25 కోట్లు వస్తున్నట్లు వివరించారు. ఆదాయం రూ.25 కోట్లు వస్తే రూ.200 కోట్లకు తీర్మానాలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఇటీవల 98 కోట్లు వచ్చినట్లు ఎమ్మెల్యేకు అధికారులు వివరించారు. ఇంకా వంద కోట్లు ఎక్కడి నుంచి తీసుకొస్తారని అన్నారు. ఎమ్మెల్యే అడిగిన వాటికి అధికారుల వద్ద సమాధానం లేక నీళ్లు నమిలారు. అడ్డగోలుగా నిధులు దుబారా చేస్తున్నారని మండి పడ్డారు. ఏ అధికారి ఎక్కడ పనిచేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొన్నదన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఎక్కడ పనిచేస్తున్నారని ఆరా తీశారు. అధికారుల పనితీరుపై ఆమె మండి పడ్డారు. టెండర్ లేకుండా పనులు ఎలా చేస్తున్నారని వారిని ప్రశ్నించారు. టెండర్లు లేకుండా ఎన్ని పనులు చేశారో, వాటి వివరాలు ఇవ్వాలన్నారు. డివిజన్ల వారీగా పనుల వివరాలు ఇవ్వాలన్నారు.

అధికారులపై ఆగ్రహం

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో పిచ్చి మొక్కలు తొలగించడానికి ఏడు కోట్లు కేటాయించడంపై ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్ని పిచ్చి మొక్కలు తొలగిస్తే ఏడు కోట్లు ఖర్చు అవుతుందని ఆమె అధికారులను ప్రశ్నించారు. అధికారుల తీరుపై మండి పడ్డారు. అడ్డగోలుగా డోజర్లు, జేసీబీలు ఇంతగానం ఎందుకు పెట్టారో సమాధానం చెప్పాలన్నారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఈ డబ్బులు పెడితే కొత్త జేసీబీలు, డోజర్లు వస్తాయన్నారు.

రోడ్డు విస్తరణ ఎందుకు చేయలేదు..

బడంగ్‌పేట నుంచి నాదర్‌గుల్ వరకు రోడ్డు విస్తరణ చేపట్టాలని గత రెండు సంవత్సరాల నుంచి చెబుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ఆమె అధికారులపై మండిపడ్డారు. రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోక పోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇక నుంచి ఇలా చేస్తే నడవదన్నారు. విద్యుత్ స్తంభాలను తొలగించాలన్నారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించాలని ఫారెస్ట్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. రోడ్డు మధ్యలో ఉన్న బోర్డులను తొలగించాలన్నారు. మున్సిపల్‌కు సంబంధించిన స్థలంలో ఆర్ అండ్ బీ అధికారుల అనుమతి ఎలా తీసుకుంటారన్నారు. వాటిని వెంటనే తొలగించాలన్నారు. వాటి పైన ఉన్న బ్యానర్లు తొలగించాలన్నారు. ఇప్పటి వరకు ఇందిరమ్మ, రేషన్ కార్డు దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది లబ్ధిదారులను గుర్తించారని, పూర్తి జబితాను ఇవ్వాలన్నారు. శ్మశాన వాటికల అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. 1800ల పై చిలుకు వర్కుల వివరాలు ఇవ్వాలన్నారు. మరోసారి వీటిపైన చర్చిస్తానని ఎమ్మెల్యే అన్నారు. అధికారుల తీరు మారక పోతే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

హుడా కాంప్లెక్స్‌లో అధికారులు సీజ్‌చేసిన సరూర్‌నగర్ కమర్షియల్ కాంప్లెక్స్

సరూర్‌నగర్‌లో దుకాణాలు సీజ్

ఎల్బీనగర్, ఫిబ్రవరి11: సరూర్ నగర్ వాణిజ్య సముదాయంలోని షాపులను హెచ్ ఎండీఏ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. పోలీసు బందోబస్తు మధ్య హెచ్‌ఎండీఏ అధికారి రాజేశ్వరి ఆధ్వర్యంలో అధికారులు 16 షాపులను ఖాళీ చేయించి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ భవనం పూర్తిగా శిథిలావస్థలో ఉందని కోర్టు ఆదేశాలతో షాపులను ఖాళీ చేయించామన్నారు. పదిహేను సంవత్సరాలుగా అద్దె లేకుండా షాపులు నడుపుకుంటున్నారు. కాగా 2024 ఆగస్టులో హైకోర్టు ఈ భవనంలోని షాపులను ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా షాపులను ఖాళీ చేసేందుకు వెళ్లిన అధికారులను మహిళలు అడ్డుకున్నారు. ఇంత కాలం షాపింగ్ కాంప్లెక్స్‌లనే నమ్ముకుని జీవితం సాగిస్తున్నామని తమకు ప్రత్యామ్నాయం చూపాలని లీజు దారుల సంఘం ప్రధాన కార్యదర్శి అర్జున్, కేశవరెడ్డి కోరారు. తమ కేసులు కోర్టులో ఉన్నాయని న్యాయం చేయాలని కోరారు. నూతన భవనం నిర్మించి తమకు షాపులు కేటాయించాలని కోరారు.

షాపులను ఖాళీ చేయించిన సందర్భంగా మాట్లాడుతున్న లీజుదారుల సంఘం ప్రధాన కార్యదర్శి అర్జున్, కార్యవర్గ సభ్యులు కేశవరెడ్డి ,తదితరులు

హామీలు అమలు చేసేవరకు ప్రభుత్వాన్ని నిలదీస్తాం

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 10 : రాష్ట్ర ప్రభుత్వం వృద్ధుల ఉసురు పోసుకుంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆమె.. మండల పరిధిలోని ముచ్చర్ల గ్రామంలో వృద్ధులతో మాట్లాడిన అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారంలోకి రావడానికి ఆచరణలో అమలు కానీ హామీలు ఇచ్చారని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ రూ.2వేలు మాత్రమే పింఛన్ ఇస్తున్నాడని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.4 వేల ఇస్తామని చెప్పి ఇవ్వకపోవడం దురదృష్టకర మన్నారు. అధికారంలోకి వచ్చి 12 నెలలు గడిచినా హామీని నెరవేర్చకపోవడం విడ్డూరంగా ఉందని చెప్పారు. ప్రభుత్వం మమ్మల్ని మోసం చేసిందని అన్ని వర్గాల ప్రజలు వాపోతున్నట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తామని వివరించారు. ముచ్చర్ల నుంచి ఊట్లపల్లి గ్రామానికి వెళ్లి పింఛన్లు ఇవ్వాల్సిందిగా పోస్టుమ్యాన్‌ను ఆదేశించారు. రేవంత్ రెడ్డి ఇప్పటికైనా పాలనపై దృష్టి పెట్టి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు వస్తున్నాయని చెప్పారు.

మృతుని కుటుంబాన్ని ఆదుకుంటాం..

మృతుని కుటుంబాన్ని ఆదుకుంటానని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని వడ్లపల్లి గ్రామానికి చెందిన టీఆర్ఎస్ నాయకుడు మహేశ్ తండ్రి లక్ష్మయ్య మృతి చెందగా... ఆమె ఆ గ్రామానికి వెళ్లి మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. మహేశ్ కుటుంబ సభ్యులను ఓదార్చారు . పార్టీ అన్ని విధాలా ఆదుకుంటుందని, మీకు నేను అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ అధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్ , మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురసాని సురేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు గంగాపురం లక్ష్మీ నరసింహ రెడ్డి , కాకి దశరథ ముదిరాజ్, కాకిరాములు , మహిళా అధ్యక్షురాలు తాండ్ర ఇందిర మ్మ దేవేందర్, యూత్ నాయకులు తాళ్ల కార్తీక్, సోషల్ మీడియా కన్వీనర్ దీక్షిత్ రెడ్డి, ఇరుపాక దామోదర్ రెడ్డి, గుయ్యని సామయ్య, మాజీ డైరెక్టర్ సామ ప్రకాశ్‌రెడ్డి, దామోదర్ గౌడ్, బొక్క వెంకట్‌రెడ్డి, సురుసాని సుదర్శన్ రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, మాజీ సర్పంచులు ధ్యారంగుల జంగయ్య , నరసింహ, మోహన్, మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దూర విద్య ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 11: ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ ఆర్సీడీఈ)లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పీజీఆర్ఆర్సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ జీబీ రెడ్డి తెలిపారు. మార్చి 31 వరకు ప్రవేశాలు నిర్వహిస్తామని ప్రకటించారు. వివిధ పీజీ, యూజీ, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులతో కలిపి మొత్తం 72 ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ కోర్సులను అందిస్తున్నట్లు వివరించారు. కోర్సుల వివరాలు, నిబంధనలు, ఫీజు వివరాలు తమ వెబ్ సైట్ www. oucde. netలో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. వివరాలకు 88861 11690, 040-27097177, 040-27098350 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మలక్‌పేట ఏరియా దవాఖానలో

యాక్టివిటీ, రిక్రియేషన్ సెంటర్ ప్రారంభం

సైదాబాద్, ఫిబ్రవరి 11 : మలక్‌పేట ఏరియా దవాఖానలోని పిడియాట్రిక్ వార్డు వద్ద నూతనంగా పిక్స్ ఫ్లో-ఆనంద ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన యాక్టివిటీ, రిక్రియేషన్ సెంటర్‌ను మంగళవారం మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బలాల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్య సమస్యలతో వచ్చే చిన్నారుల్లో ఉత్సాహాన్ని , ఆనందం నింపేందుకు యాక్టివిటీ రిక్రియేషన్ సెంటర్ ఎంతోగానో ఉపయోగపడుతుందని అన్నారు. వైద్య నిమిత్తం వచ్చే రోగులు, వారి సహాయకుల పిల్లలను ఈ సెంటర్లో ఉంచడం ద్వారా కాలక్షేపం చేయడంతోపాటు మిగతా చిన్నారులతో కలిసి ఆడుకోవడం, ఆహ్లాదకరమైన వాతావరణంలో గడపడం ద్వారా వారి రోగాన్ని తగ్గించి మానసిక ప్రశాంతతను పెంచుతుందని అన్నారు. పిల్లల్లో మానసిక ప్రవర్తనలో మార్పులు తీసుకుని రావడంతో పాటు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచడానికి స్వచ్ఛంద సేవాసంస్థ సెంటర్‌ను ఏర్పాటు చేయడాన్ని ఆయన అభినందించారు. సెంటర్‌లో వదిలి పెట్టిన చిన్నారుల బాగోగులు చూసుకోవడానికి సిబ్బంది ఉంటారని, వారి ఖర్చులను ఆనంద ఫౌండేషన్ సంస్థ భరిస్తుందని తెలిపారు.

అదే విధంగా రాబోయే రోజుల్లో క్రియేటివిటీ రిక్రియేషన్ సెంటర్‌ను బలోపేతం చేయడానికి తన సహాయ సహకారాలు అందిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అక్బర్ బాగ్ డివిజన్ కార్పొరేటర్ మీనాజుద్దీన్, మలక్ పేట ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ మొగిలి సురేశ్‌కుమార్, ఆనంద ఫౌండేషన్ ప్రతినిధి సీత, దవాఖాన ఏవో ఆంజ నేయులు, తదితరులు పాల్గొన్నారు.

పార్కుల సమగ్రాభివృద్ధికి కృషి

వనస్థలిపురండివిజన్‌లోని పార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, అధికారులు

వనస్థలిపురం, ఫిబ్రవరి 11 : వనస్థలిపురం డివిజన్‌లోని అన్ని పార్కుల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్‌లోని పోలీస్ స్టేషన్ వెనకవైపు కూడా పార్కు, అభ్యుదయనగర్ కాలనీ పార్కులను ఆయన సందర్శించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. పార్కులు ఆరోగ్యాన్ని, ఆహ్లాదాన్ని పంచుతాయన్నారు. అవకాశమున్న ప్రతీ కాలనీలో పార్కుల ను నిర్మించి అభివృద్ధి చేస్తామని తెలిపారు. పిల్లలు, వయోపరులు పార్కులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పార్కుల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి రూ.60 లక్షలు మంజూరు చేయించడం జరిగిందన్నారు. పార్కుల్లో టాయిలెట్లు, మరుగుదొడ్లు , సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎండీఏ అధికారి రంజిత్, అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ మధుసూదన్ రెడ్డి, సభ్యులు అశోక్‌గౌడ్, ముట్టిలింగం, రామ్‌రెడ్డి, కృష్ణా రెడ్డి, సాయికిరణ్ గౌడ్ పాల్గొన్నారు.

అనాథలను ఆదుకుంటాం : బీఆర్ఎస్

ఆదర్శ అనాథ విద్యార్థి సదనం విద్యార్థులకు స్కూల్ ఫీజు కోసం రూ. 75 వేలు అందజేస్తున్న చంద్రశేఖర్ రెడ్డి, ప్రశాంత్, తదితరులు

ఎల్బీనగర్, ఫిబ్రవరి 11 : అనాథలను ఆదుకుంటామని బీఆర్ఎస్ నాయకుడు ఎస్. చంద్ర శేఖర్ రెడ్డి అన్నారు. మంగళ వారం చైతన్యపురి బీఆర్ఎస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి నాయకత్వంలో ఫణిగిరి కాలనీ ఆదర్శ ఫౌండేషన్ అనాథ పిల్లలకు స్కూల్ ఫీజు బాకీయిలు ఉన్నాయని నిర్వాహకులు ప్రదీప్ చెప్పగా.. ఫీజుల నిమిత్తం రూ.75 వేలను అందజేశారు. నిధులు అందించిన ప్రశాంత్ రెడ్డి, కల్యాణ్, వీరన్, వేణు, సురేశ్, సూర్య, నరేందర్‌ల సహకారంతో రూ.75,000ల చెక్‌ను ఫౌండేషన్‌వారికి అందించినట్లు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వరప్రసాద్, ప్రసాద్, కల్యా ణ్, సూర్య, ప్రవీణ్, జలంధర్, నరేందర్, శ్రీధర్, నవీన్, డేవిడ్ పాల్గొన్నారు.

గీత కార్మికుల సహకార సంఘం కార్యవర్గం

కందుకూరు ఫిబ్రవరి 10 : కందుకూరు మండలం, కొత్తూరు గ్రామ గీత కార్మికుల సహకార సంఘం లిమిటెడ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. మంగళవారం రాష్ట్ర సహకార సంఘం ఎలక్షన్ అథారిటీ అధికారి రహీముద్దీన్ అధ్యక్షతన నామినేషన్స్ స్వీకరించారు. అనంతరం ఎన్నిక ద్వారా నూతన కమిటీని ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తోకల శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా పల్లె కృష్ణ గౌడ్, డైరెక్టర్లుగా కర్నాటి పెద్ద నరసింహ గౌడ్, ఫకీర్ శమంతలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. గీత కార్మికులకు అండగా ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో సహకార సం ఘం సభ్యులు పల్లె యాదయ్య గౌడ్, తోకల వెంకటయ్య గౌడ్, కర్నాటి సోమయ్య, యాదయ్య, తోకల దశరథ, యాదగిరి గౌడ్, అశోక్, కర్నాటి జంగయ్య, తోకల నరసింహ, కర్నాటి బలరాం, శంకరయ్య, చిన్న నర్సింహ, కాటం కృష్ణయ్య , రవీందర్, పల్లె జనార్దన్, ముత్యా లు, ప్రభాకర్ గౌడ్, వీరేశ్, రాజు గౌడ్, ఈశ్వర్, శ్రీనివాస్, ధనుంజయ, చంద్రశేఖర్, కె.శ్రా వణ్ కుమార్, శేఖర్,అఖిల్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, ఫిబ్రవరి 11 : వేసవి విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్ పరిధిలో బుధవారం వివిధ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పిలిపివేస్తున్నట్లు ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్ డీఈ విష్ణువర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ జోరాభి దర్గా ఫీడర్ పరిధిలోని అమూల్ హోటల్ ఆల్ సఫా డైరీ జోరాభి దర్గా ప్రాంతాల్లో ఉదయం 12 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, అదే విధంగా 11కేవీ బడా బజార్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు చోటా చింతల్ నగర్ జాబ్ జాఫర్ మెయిన్ రోడ్ రామన్ వాడి హోటల్, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

దీన్ దయాల్ జీకి నివాళి

మలక్ పేట, ఫిబ్రవరి 11: పండిత్ దీన్ దయాల్ జీ జీవితం నేటి యువతకు ఆదర్శమని ముసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి అన్నారు. పండిత్ దీన్ దయాల్ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం కృష్ణ తులసీనగర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన వర్ధంతి వేడుకల్లో దీన్ దయాల్ జీ చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .. పండిత్ దీన్ దయాల్ జీ మంచి దూర దృష్టి కలిగినటువంటి వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు సురేందర్ కొంగర ప్రవీణ్ కుమార్ అజయ్, సంతోష్, మల్లేశ్, పరశురాం, గణేశ్ పాల్గొన్నారు .

17 నుంచి సెల్ట్ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 11: ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్)లో ఈ నెల 17 నుంచి తరగతులను నిర్వహించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సవీన్ సౌడ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్ మెంట్' పేరుతో నిర్వహించే రెండు నెలల కోర్సుకు ప్రతిరోజూ ఉదయం ఆరున్నర నుంచి ఎనిమిది గంటల వరకు ప్రత్యేక బ్యాచ్‌ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఇతర వివరాలకు 79899 03001, 98497 52655 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వాస్పత్రికి దారేది.?

నరకయాతనకు గురవుతున్న గర్భిణులు, రోగులు

మద్యం ప్రియులకు అడ్డాగా పరిసర ప్రాంతాలు

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

హయత్‌నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్

హయత్‌నగర్, ఫిబ్రవరి 11 : హయత్‌నగర్ మండల కార్యాలయం ఆవరణలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (ప్రభుత్వాస్పత్రి) గర్భిణులకు, రోగులకు నరకయాతనంగా మారింది. హయత్‌నగర్‌లోని చుట్టుపక్కల కాలనీల ప్రజలు, అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని ఆయా గ్రామాల పేద, మధ్య తరగతి ప్రజలు ఇక్కడి సీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం వస్తుంటారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోనికి హయత్‌నగర్ సీహెచ్‌సీ వస్తుంది. హయత్‌నగర్ మాత్రం ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. దాంతో హయత్‌నగర్ సీహెచ్‌సీ రెండింటికీ చెడ్డ రేవడిలాగా తయారైంది. ఆస్పత్రి మాత్రం హయత్‌నగర్‌లో ఉండగా అధికారికంగా సేవలు ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంగా అందుతున్నాయి. హయత్‌నగర్ సీహెచ్‌సీపై స్థానిక ప్రజాప్రతినిధులు సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

హయత్‌నగర్‌లో విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు శరవేగంగా సాగుతుండడంతో కొంత కాలంగా యూటర్న్‌ల సమస్య స్థానికులను తీవ్రంగా వేధిస్తోంది. దాంతో ఆయా కాలనీల ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హయత్‌నగర్ సీహెచ్‌సీలో చికిత్స నిమిత్తం వెళ్లాలంటే నరకయాతనకు గురవుతున్నారు. హయత్‌నగర్ హైవే బావర్చి, శ్రీరాఘవేంద్ర హోటల్ వద్ద, హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ వద్ద యూటర్న్ తీసుకొని హయత్‌నగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి రావాల్సి వస్తుంది. లేకపోతే ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన మినీ గ్రిల్స్ నుంచి రాకపోకలు సాగించాల్సి వస్తుంది. దీంతో గర్భిణులు, వృద్ధులు, రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రిళ్లు మండల కార్యాలయం మద్యం బాబులకు అడ్డాగా మారడంతో ఆస్పత్రిలోకి గుర్తుతెలియని వ్యక్తులు, మద్యం తాగేవాళ్లు వస్తారేమోనన్న బాలింతలు, రోగులు భయాందోళనకు గురవుతున్నారు.

ప్రహారీ నిర్మించాలి...

హయత్‌నగర్ సీహెచ్‌సీకి ప్రత్యేకంగా ప్రహారీని నిర్మించి మెయిన్ గేటును ఏర్పాటు చేస్తే 108 అంబులెన్స్, గర్భిణులు, రోగులను తీసుకొచ్చే వాహనాలకు సులభతరం అవుతుంది. మద్యంరాయుళ్ల ఆగడాలు, గుర్తుతెలియని వ్యక్తుల కదలికలు లేకుండా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఆస్పత్రికి ప్రత్యేకంగా ప్రహారీని నిర్మించాలని పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం..

హయత్‌నగర్ మండల కార్యాలయంలోని అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు నానా అవస్థలకు గురవుతున్నారు. ప్రతి రోజూ హయత్‌నగర్ మండల కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ఫిర్యాదుదారులు, వైద్య చికిత్స నిమిత్తం వచ్చే గర్భిణులు, వృద్ధులు, రోగులు పడరానిపాట్లు పడుతున్నారు. మండల కార్యాలయానికి కుంట్లూరు రోడ్డులో ఉన్న మెయిన్ గేటును మూసి ఉంచడంతో వారందరూ ఎక్కడి నుండి లోపలికి వెళ్లాలో తెలియక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన గేట్ల వద్దనే మినీ వ్యాన్లు, ఇతర ప్రైవేటు వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. మెయిన్ గేటు వద్ద యథేచ్ఛగా మినీ వ్యాన్లను పార్కింగ్ చేసి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు స్థానికంగా వెలువడుతున్నాయి. జాతీయ, రాష్ట్రీయ స్థాయి నేతల జయంతి, వర్ధంతుల కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులు హయత్‌నగర్ సీహెచ్‌సీలో గర్భిణులు, బాలింతలకు, రోగులకు పండ్లు, బ్రెడ్డు ప్యాకెట్లు పంచి చేతులు దులుపుకుంటున్నారే తప్ప వారి సమస్యలను పట్టించుకున్న పాపాన పోవడం లేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ప్రభుత్వ యంత్రాంగం స్పందించి హయత్‌నగర్ సీహెచ్‌సీ వద్ద సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.